# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 95 క్రిష్ణా, సోమవారం 29 - 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వసంత..

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్..

నియోజకవర్గ జర్నలిస్టులకు ఆరోగ్య బీమాకు హామీ ఇచ్చిన వసంత కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజా ప్రెస్ క్లబ్..

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు..



**ఎన్టీఆర్ జిల్లా,నందిగామ రూరల్,డిసెంబర్ 28(బ్యూరో చీఫ్ సల్మాన్):** మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ఐతవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం లోని పత్రికేయులందరూ మరియు 'ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు'. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎప్పుడు అండగా ఉంటానని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాలకు తన సొంత ఖర్చులతో ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తానని వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇవ్వడం పై ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు వసంత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా శివ, చల్ల రవీంద్ర, ఉపాధ్యక్షులు మెరుగుమాల రాఘవులు, టంగుటూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దాసి ప్రతాప్, సభ్యులు సల్మాన్, నరేష్, జర్నలిస్టులు సుశీల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ కేబినెట్ సమావేశం: రాష్ట్ర అభివృద్ధి, కీలక ప్రాజెక్టులపై చర్చలు




**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** నేడు సచివాలయంలో ఉదయం 11 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం జరగనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ కేబినెట్ మీటింగ్‌లో కీలక అంశాలపై చర్చలు జరిగి, నిర్ణయాలు తీసుకోనున్నారు. మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు, అలాగే పలు రెవిన్యూ డివిజన్లకు కేబినెట్ ఆమోదం ఇవ్వనుంది. అమరావతిలోని క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రాంగణంలో 2 ఎకరాల్లో రూ. 103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్ణయించనున్నారు. అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కోసం రూ. 109 కోట్ల కేటాయింపు, శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం, తుళ్లూరులో హెూటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు కోసం 6 ఎకరాలు భూ కేటాయింపు కూడా చర్చకు వస్తాయి. అంతే కాకుండా, 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ. 444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు కోసం కేబినెట్ ఆమోదం ఇవ్వనుంది. ఇక ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ. 1358 కోట్ల కేటాయింపు, జరీబు లేదా మెట్ట ప్రాంతాల్లో 202 ఎకరాల భూమి స్థితి నిర్ధారణ కోసం రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు, పలు సంస్థలకు భూ కేటాయింపులు, రుషికొండ నిర్మాణాలతో సంబంధించి కూడా చర్చలు జరుగుతాయి. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో, మెడికల్ కాలేజీ టెండర్లపై పీపీపీ విధానం గురించి మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం ఇచ్చునున్నారు.

## ప్రధాని ప్రశంసలపై సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరసాపురం లేస్ క్రాఫ్ట్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ఆదివారం ప్రసారమైన తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ కళ యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని ప్రశంసలపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. నరసాపురం లేస్ కళను ప్రశంసించినందుకు ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. తరతరాలుగా కుటుంబాలు సంఘాలు కాపాడుకుంటున్న అనేక సంప్రదాయ కళలకు ఆంధ్రప్రదేశ్ నిలయం. నరసాపురంలో పుట్టిన క్రోచెట్ లేస్ తయారీ అటువంటి అద్భుతమైన కళారూపం అని పేర్కొన్నారు. ఈ కళను కాపాడటమే కాకుండా, ప్రపంచానికి పరిచయం చేస్తున్న మహిళల నైపుణ్యాన్ని, అంకితభావాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కళకు, కళాకారులకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. అంతకుముందు తన ప్రసంగంలో ప్రధాని మోదీ, సంప్రదాయ కళలు సమాజానికి సాధికారత కల్పించడంతో పాటు ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన సాధనంగా నిలుస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళ ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. తరతరాలుగా ఈ కళ మహిళల చేతుల్లోనే భద్రంగా ఉంది అని కొనియాడారు. ఈ కళను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ కలిసి పనిచేస్తున్నాయని, కళాకారులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయని ప్రధాని వివరించారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ కూడా లభించిందని గుర్తుచేశారు. దీని ద్వారా 500కు పైగా ఉత్పత్తులు తయారవుతున్నాయని, 250 గ్రామాల్లో దాదాపు లక్ష మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## ఆవకాయ్ అమరావతి ఉత్సవానికి ఆదిలోనే ఇబ్బందులు



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఆవకాయ్ అమరావతి ఉత్సవాలకు ప్రారంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విజయవాడలో జనవరి 8 నుంచి 10 వరకూ మూడు రోజుల పాటు ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు నిర్వహించాలని ఏపీ పర్యాటక శాఖ నిర్ణయించింది. ఇటీవలే ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. భవానీ ద్వీపం,పున్నమి ఘాట్‌లో ఆవకాయ్ అమరావతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నృత్యం, కవిత్వం, సంగీతం, సినిమా సాహిత్యం వంటి విభాగాలలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆవకాయ్ అమరావతి ఉత్సవాలకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తున్న సమయంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. పున్నమిఘాట్‌లో ఆవకాయ్ అమరావతి ఉత్సవాల నిర్వహణకు పున్నమిఘాట్‌లోని ప్రైవేట్ భూయజమానులు అడ్డం తిరిగారు. తమను సంప్రదించకుండా తమ భూముల్లో ఏ విధంగా కార్యక్రమం నిర్వహిస్తారంటూ మండిపడుతున్నారు. ఈ మేరకు మీడియా సమావేశం ఏర్పాటుచేసిన ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు... నోటీసులు ఇవ్వకుండానే తమ స్థలాల్లోని గోడలు పగలగొట్టడంపై మండిపడుతున్నారు. పున్నమి ఘాట్‌లో 20 ఎకరాల వరకూ ప్రైవేట్ పట్టా భూమి ఉందని.. తమ భూమిని కాపాడుకోవడానికి కట్టుకున్న గోడలు కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పుష్కరాలు సమయం నుంచి భూమిలిచ్చి ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరిస్తున్నామంటున్న ప్రైవేట్ భూ యజమానులు.. తమ భూములలోఅవకాయ అమరావతి కార్యక్రమం నిర్వహణకు తమను సంప్రదించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఎగ్జిబిషన్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని.. నోటీసులు ఇవ్వకుండానే పడగొడతారా అని ప్రశ్నిస్తున్నారు. తమ భూములకు హద్దులు వేసుకుని పరిరక్షించుకుంటామంటున్నారు. 20 ఏళ్లుగా తమ స్థలాలను వాడుకుంటూ రూపాయి కూడా ఇవ్వడం లేదని.. ప్రైవేట్ భూములలో కార్యక్రమాలు ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు. తమకు సహకరిస్తే.. ప్రభుత్వానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రభుత్వ చర్యలపై అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని తెలిపారు. మరోవైపు జనవరి 8వ తేదీ నుంచి పదో తేదీ వరకూ మూడు రోజుల పాటు ఈ ఆవకాయ్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. వీటికి ప్రవేశం ఉచితంగా కల్పిస్తున్నారు. ఆవకాయ్ ఉత్సవంలో భాగంగా సంగీత, నాటక ప్రదర్శనలు, సినిమా%-%సాహిత్య చర్చలు, వర్క్‌షాపులు, ఘాట్ ఫెర్రీ ప్రయాణాలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఈ ఏడాది భారత్‌కు గర్వకారణం ప్రతిచోటా భారత దేశ ప్రభావం స్పష్టం

**క్రైం కౌంటర్ న్యూస్,** న్యూఢిల్లీ, డిసెంబరు 28: భారత్ గర్వించదగిన, చిరస్మరణీయమైన ఎన్నో మైలురాళ్లను 2025 అందించిందని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్' 129వ ఎపిసోడ్‌లో ఆయా కీలక ఘట్టాలను ఆయన గుర్తుచేసుకున్నారు. జాతీయ భద్రత, క్రీడలు, సాంకేతిక ఆవిష్కరణలతో పాటు ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై ఈ ఏడాది భారతదేశం ప్రభావం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ప్రతి భారతీయుడికి గర్వకారణమైన ఆపరేషన్ సిందూర్... భద్రత విషయంలో దేశం రాజీ పడదని ప్రపంచానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. జాతీయ గేయమైన వందేమాతరం 150 ఏళ్ల పూర్తి చేసుకున్నప్పుడు కూడా ఇదే స్ఫూర్తి కనిపించిందని చెప్పారు. పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని, మహిళల క్రికెట్ జట్టు తొలిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకొని క్రీడల పరంగా ఈ ఏడాదిని చిరస్మరణీయంగా మార్చాయని అన్నారు. అంతేకాకుండా, మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను సాధించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఆసియా కప్ టీ20లో అద్భుతమైన విజయం సాధించిన తర్వాత త్రివర్ణ పతాకం గర్వంగా రెపరెపలాడిందని, పారా అథ్లెట్లు ప్రపంచ చాంపియన్‌షిపలో పతాకల పంట పండించారని మోదీ కొనియాడారు. సైన్స్, అంతరిక్ష రంగాల్లోనూ భారత్ గొప్ప ముందడుగు వేసిందని, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా నిలిచారని పేర్కొన్నారు. ఈ ఏడాది దేశంలోని చిరుతపులుల సంఖ్య 30కి పైగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా 2025లో జరిగిన వివిధ కార్యక్రమాలను మోదీ ప్రస్తావించారు. మన సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీకగా ఏడాది ప్రారంభంలో ప్రయాగరాజ్‌లో నిర్వహించిన మహా కుంభమేళా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని అన్నారు. అయోధ్య రామమందిరంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందన్నారు. "2025 భారత్‌కు మరింత ఎక్కువ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. సరికొత్త ఆశలు, సంకల్పాలతో నూతన సంవత్సరం 2026లో ముందుకు సాగడానికి దేశం సిద్ధంగా ఉంది' అని మోదీ అన్నారు.

భారత్‌వైపు ఆశగా చూస్తున్న ప్రపంచం ప్రపంచం మొత్తం ఈ రోజు భారత్‌వైపు ఎంతో ఆశగా చూస్తోందని, దేశంలోని యువ శక్తే దీనికి అతిపెద్ద కారణమని మోదీ అభివర్ణించారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంతో పాటు 'యంగ్ లీడర్స్ డైలాగ్'ను నిర్వహిస్తామని, అందులో తాను కూడా తప్పనిసరిగా పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవిష్కరణలు, ఫిట్‌నెస్, స్టార్టప్‌లు, వ్యవసాయం తదితర కీలక అంశాలపై యువత తమ ఆలోచనలు పంచుకుంటారని వెల్లడించారు. భారతీయ సంస్కృతి, భాషలను విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా కొత్త తరాన్ని తమిళ భాషతో అనుసంధానించడానికి ఫిజీలో జరుగుతున్న



ప్రయత్నాలను ప్రశంసించారు. కాగా, యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వాడకంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి ఇష్టానుసారంగా తీసుకొనేవి కావని, డాక్టర్ సలహా మేరకే వాడాలని ప్రజలను కోరారు. లేస్ పరిశ్రమకు కేరాఫ్ నరసాపురంపశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్దనున్న సీతారాంపురం గ్రామం లేస్ పరిశ్రమకు కేరాఫగా నిలుస్తోంది. దాదాపు 160 ఏళ్ల క్రితం ఐర్లాండ్ దేశస్థులు వ్యాపారం నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడి మహిళలకు లేసు అల్లికలపై శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు అల్లికలను విదేశాలకు ఎగుమతి చేశారు. ఇలా మొదలైన లేస్ పరిశ్రమ 2010కల్లా వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ఏటా రూ. 150 కోట్ల ఎగుమతులు జరిగేవి. 2010లో ప్రభుత్వం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో లేస్ పార్కును ఏర్పాటుచేసి మహిళలకు అల్లికల్లో ఆధునిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించడం మరింత గుర్తింపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే నరసాపురం లేస్ క్రాఫ్ట్ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని మోదీ ప్రశంసించారు. దుబాయ్‌లో కన్నడ పాఠశాలపై ప్రధాని ప్రశంస దుబాయ్‌లో కన్నడ పాఠశాల ఏర్పాటు పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు అందజేశారు. ప్రవాస కన్నడిగుల కోసం కన్నడ పాఠశాల కొనసాగించడం సంతోషకరమన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో భాగంగా కన్నడిగుల భాషాభిమానాన్ని ప్రధాని కొనియాడారు. దుబాయ్‌లో నివసించే కన్నడిగులు కన్నడ భాషను మరువరాదని ఓ ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేశారని, పిల్లలకు కన్నడ రాయడం, చదవడం, మాట్లాడడం నేర్పుతున్నారని,. సుమారు వెయ్యిమంది పిల్లలకు కన్నడ భాష నేర్పించే ప్రక్రియ జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

# బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. ఏపీలో 'లేడీ డాన్'గా

క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28, ఐటీ రంగంలో కొలువు.. చక్కగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. అది కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కేరాఫ్ అడ్రస్ అయిన బెంగళూరులో.. వారంలో ఐదు రోజుల పని.. రెండ్రోజుల వీకాఫ్.. వీకెండ్స్‌లో పబ్బులు, పార్టీలు. డిస్కోలు అంటూ ఛిల్ అవ్వలేదా ఆ యువతి. ఇది కాదు ఇంకా కావలనుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం బోర్ కొట్టిందో.. జస్ట్ ఫర్ ఛేంజ్ అనుకుందో.. రూటు మార్చింది.. గేరు మార్చింది.. బెంగళూరులో మహిళా టెకీ కాస్తా.. ఏపీలో " లేడీ డాన్" అయ్యింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..అనకాపల్లి జిల్లాలోని నాతవరం పోలీసులు శనివారం రోజున ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన ఓ మహిళ కూడా ఉంది. నర్సీపట్నం నుంచి తమిళనాడు, శ్రీలంకకు.. శీలావతి రకం గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తున్నారనే కారణంతో ఈ ఎనిమిది మందిని నాతవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయిని.. శ్రీలంకకు తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలసారని పోలీసులు చెప్తున్నారు. అయితే ఈ గంజాయి స్మగ్లింగ్ వెనుక ఓ మహిళా టెకీ పాత్ర ఉందని పోలీసులు చెప్తున్నారు. అరెస్ట్ చేసిన వారిలో మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కూడా ఉంది. విజయనగరం జిల్లా సంతకవిటి మండలానికి చెందిన 28 ఏళ్ల గాదె రేణుక అనే మహిళను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. గాదె రేణుక బీటెక్ చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. అయితే ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గాదె రేణుక రూటు మార్చారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి.. గంజాయి స్మగ్లింగ్ ప్రారంభించారు. పాయకరావుపేట, నర్సీపట్నం, సాలూరు, బెంగుళూరు ప్రాంతాలలో రేణుక గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి అక్రమ రవాణా చేస్తూ గాదె రేణుక కాస్తా లేడీ డాన్‌గా పేరు సంపాదించుకున్నట్లు వెల్లడించారు. రేణుక, ఆమె సహచరుడు సూర్య కాళిదాస్, ఒడిశా నుంచి గంజాయిని సేకరించి తమిళనాడు, శ్రీలంకకు సరఫరా చేయడానికి



నర్సీపట్నంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో.. సృగవరం గ్రామం సమీపంలో ఆ ముఠాను అడ్డగించి.. అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 74 కిలోల ఎండు గంజాయి, ఒక కారు, రెండు బైక్‌లు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తమ గంజాయి వ్యాపారాన్ని విస్తరించడానికి రేణుక.. బెంగళూరు, కోయంబత్తూరులో ఇళ్లను అద్దెకు తీసుకుని ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అద్దూరి ప్రసాద్ అనే మధ్యవర్తి సాయంతో ఒడిశా సరిహద్దుల్లోని బలిమెల, చిత్రకొండ ప్రాంతాలలో కిలో 5 వేల రూపాయల చొప్పున గంజాయిని కొనుగోలు చేస్తూ.. మదన్ కుమార్, నాగముత్తు అనే ఇద్దరు డ్రైవర్ల సాయంతో ఈ సరుకును రాజానగరం హైవే జంక్షన్ వద్దకు చేర్చేవారని పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి తమిళనాడు, శ్రీలంకకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమ రవాణా మాత్రమే కాకుండా చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో తమిళనాడులో గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రేణుకకు మిగతా స్మగ్లర్లతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# మదనపల్లె బదులు అన్నమయ్య ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లా పేరు కొనసాగింపు





**స్వరూపంలో భారీ మార్పు**
**రాయచోటి బదులు మదనపల్లె కేంద్రంగా జిల్లా**
**కడపలోకి రాజంపేట.. తిరుపతిలోకి రైల్వేకోడూరు**
**మొత్తం జిల్లాల సంఖ్య 29 నుంచి 28కి పరిమితం**
**కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలు**
**మదనపల్లె జిల్లాగా ఉండదు.. ఇది అన్నమయ్యలోకి..**
**నెల్లూరులోకి గూడూరు, కోట, చిల్లకూరు మండలాలు**
**రాపూరు, సైదాపురం, కలువాయి కూడా..**
**తిరుపతిలోనే వాకాడు, చిట్టమూరు మండలాలు**
**మార్కాపురంలోనే పొదిలి.. ప్రకాశంలోనే**
**దొనకొండ,కురిచేడు.. సీఎం సమీక్షలో కీలక నిర్ణయాలు**

క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, డిసెంబరు 28 అన్నమయ్య పేరుతో జిల్లా ఉండాలన్న ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అన్నమయ్య జిల్లా పేరును కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న జిల్లా భౌగోళిక స్వరూపం దాదాపుగా మారనుంది. ప్రస్తుతం రాయచోటి కేంద్రంగా ఉన్న అన్నమయ్య జిల్లా ఇక మదనపల్లె కేంద్రంగా ఉంటుంది. ఇదివరకే ప్రకటించిన మదనపల్లె కేంద్రంగా ఏర్పాటు చేసే జిల్లాను అన్నమయ్య జిల్లాగా వ్యవహరిస్తారు. రాయచోటి కూడా ఇదే జిల్లాలో ఉంటుంది. దీంతో రాజంపేట జిల్లా కేంద్రంగా ఉండాలన్న కొందరి డిమాండ్లకు, రాయచోటినే కొనసాగించాలన్న ఆందోళనలకు తావివ్వకుండా మదనపల్లె హెడ్‌క్వార్టర్స్‌గా అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తారు. కొత్తగా ప్రకటించినట్టు మదనపల్లె జిల్లా పేరు మాత్రం ఉండదు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగిలిన రాయచోటి అన్నమయ్య జిల్లాలో కొనసాగనుంది. రెవెన్యూ శాఖ ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించి మంత్రివర్గ ఆమోదం కోసం సోమవారం ఫైలు పంపించనుంది. ఆ తర్వాత జిల్లాల ఏర్పాటుపై ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్లు విడుదలవుతాయి. ఈ విషయంలో దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లే అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒకవేళ మంత్రివర్గ భేటీలో ఏదైనా అనూహ్య చర్చ జరిగి ముఖ్యమంత్రి మార్పులు సూచిస్తే ఆ దిశగా సవరణలు ఉంటాయి.ఏ మార్పులూ ప్రతిపాదించకపోతే ఇదే పద్ధతిలో అన్నమయ్య జిల్లా స్వరూపం ఉంటుందని తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశంపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి అనిత, రెవె న్యూ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జూమ్‌కాల్ ద్వారా మీటింగ్‌లో పాల్గొన్నారు.

**అన్నమయ్యపై విస్తృత చర్చ**

తొలుత అన్నమయ్య జిల్లా అంశంపైనే భేటీలో చర్చ జరిగింది. శనివారం నాటి సమావేశంలో అన్నమయ్య జిల్లాను రద్దు చేసి అందులోని రాజంపేటను కడపలోకి, రాయచోటిని మదనపల్లె జిల్లాలో, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఆదివారం భేటీలోని ఈ విషయంపై చర్చించారు. మారిన పరిస్థితుల నేప?థ్యంలో అన్నమయ్య జిల్లా పేరును కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కొత్త జిల్లాగా ఏర్పాటు చేయబోయే మదనపల్లెను ప్రధాన కేంద్రంగా అన్నమయ్య జిల్లాను పునర్వ్యవస్థీకరించాలని అధికారులు ప్రతిపాదించారు. దీంతో అన్నమయ్య జిల్లాను రద్దు చేయాల్సిన అవసరం ఉండదని, మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ఏ సమస్య ఉండదని అధికారులు పేర్కొన్నారు. అంతేగాక రాజంపేట, రాయచోటి మధ్య హెడ్‌క్వార్టర్స్ వివాదం కూడా సమసిపోతుందని అధికారులు విశదీకరించారు. ఈ ప్రతిపాదన మధ్యేమార్గంగా ఉండటంతో సీఎం చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేశారు. మదనపల్లె ప్రధాన కేంద్రంగా అన్నమయ్య జిల్లాలో రాయచోటిని కొనసాగించాలని నిర్ణయించారు. రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని నిర్ణయించారు. ఒక దశలో అన్నమయ్య జిల్లాగానే కొనసాగించాలన్న సమాలోచనలు సాగాయి. ఒక్క రాయచోటి డివిజన్ కోసం జిల్లాను కొనసాగించడం సహేతుకం కాదని అధికారులు పేర్కొన్నారు.

**పోర్టు సమీకరణాలతో నిర్ణయాలు**

ప్రస్తుతం గూడూరు డి విజన్ తిరుపతి జిల్లాలో ఉంది. ఈ డివిజన్‌లోని వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలోనే కొనసాగించాలని నిర్ణయించారు. ఈ 2మండలాలు తిరుపతి జిల్లాలో ఉండటం వల్ల దుగరాజపట్నం పోర్టు ఆ జిల్లాలో ఉంటుంది. దీంతో రాయలసీమకు కూడా పోర్టు ఉన్నట్లవుతుంది. గూడూరు డివిజన్‌లోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను తిరుపతి జిల్లా నుంచి తిరిగి నెల్లూరు జిల్లాలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మూడు మండలాలను తిరుపతి నుంచి నెల్లూరులోకి తీసుకురావడంవల్ల కృష్ణపట్నం పోర్టు ఇదే జిల్లాలో ఉన్నట్లువుతుందని భావిస్తున్నారు. ఇక తిరుపతి జిల్లాలో ఉన్న కలువాయు, రాపూరు, సైదాపురం మండలాలను తిరిగి నెల్లూరులోకి తీసుకురావాలని అనుకుంటున్నారు. కాగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ విషయంలో తాజా సమావేశంలో మంత్రులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అన్నమయ్య జిల్లాలో మార్పులు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మండలాల పునర్వ్యవస్థీకరణ, తాజా ప్రతిపాదనలకు జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్ సమ్మతి తెలిపినట్లు తెలిసింది.

**29 కాదు... 28 జిల్లాలే**

రాష్ట్రంలో ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. కొత్తగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. దీంతో మొత్తం జిల్లాల సంఖ్య 29కు చేరింది. అయితే మారిన పరిణామాల నేపథ్యంలో మదనపల్లె పేరిట ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయడం లేదు. అన్నమయ్య పేరిట ఉన్న జిల్లాకే మదనపల్లె హెడ్‌క్వార్టర్స్‌గా ఉండనుంది. ప్రతిపాదిత మదనపల్లె జిల్లా ప్రాంతం ఇందులోనే ఉండనుంది. దీంతో జిల్లాల సంఖ్య 28కు పరిమితమైంది. పోలవరం జిల్లా కూర్పులో ఎలాంటి మార్పులేదు. కొత్తగా ఏర్పాటు కానున్న మార్కాపురం జిల్లాలో పొదిలి ఉంది. దాన్ని అక్కడే కొనసాగించాలని నిర్ణయించారు. కురిచేడు, దొనకొండ మండలాలను ప్రకాశంలోనే కొనసాగించనున్నారు. ఈ సమావేశానికి ప్రకాశం కలెక్టర్ రాజాబాబును కూడా పిలిచారు. పొదిలి, కురిచేడు మండలాల అంశంపై ఆయన అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ రెండు మండలాలపై రెవెన్యూ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సిఫారసులకే సీఎం మొగ్గుచూపినట్లు తెలిసింది

# డ్వాక్రా మహిళలకు అద్భుత అవకాశం.. ఈ - నారీలుగా ఛాన్స్



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28, డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త చర్యలు చేపడుతూ ఉంటాయి. తక్కువ వడ్డీకే రుణాలు అందించి వ్యాపారాలు చేసుకునేలా ఆర్థికంగా అండగా ఉండటంతో పాటుగా.. డబ్బును పొదుపు చేసుకునేలా ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే.. డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉండే మహిళలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ - నారీ అనే కాన్సెప్ట్ తెరపైకి వచ్చింది. ప్రస్తుత రోజుల్లో చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ లేనిదే ఏ పనీ జరగని పరిస్థితి. ఈ మార్పులకు తగినట్లు డ్వాక్రా సంఘాలలోని మహిళలకు కూడా అవగాహన కల్పించాల్సి ఉంటుంది.ఎందుకంటే డ్వాక్రా మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం కొత్త యాప్‌లు అందుబాటులోకి తెస్తోంది. ఇంటి వద్ద నుంచే రుణ వాయిదాల చెల్లింపులతో పాటుగా.. సంఘానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునేందుకు మన డబ్బులు - మన లెక్కలు వంటి మొబైల్ అప్లికేషన్లను కూడా అందుబాటులో తెస్తోంది. వీటిని ఉపయోగించాలంటే డ్వాక్రా మహిళలకు కనీస సాంకేతిక పరిజ్ఞానం అవసరం. ఈ నేపథ్యంలోనే ఈ -నారీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. డ్వాక్రా సంఘాలలో యాక్టివ్‌గా ఉండే మహిళలను.. ఈ -నారీలుగా నియమించి.. వారి ద్వారా మిగతా సభ్యులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే ఈ - నారీలుగా ఎంపికైన వారికి ఆర్థికంగా కూడా భరోసా అందించనున్నారు.ఈ - నారీ అర్హతలు ఇవే..మరోవైపు ఈ - నారీగా ఎంపిక చేసేవారికి అధికారులు కొన్ని అర్హతలు నిర్దేశించారు. వయసు 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉండాలి. సంఘం సభ్యురాలిగా కొనసాగుతూ ఉండాలి. కనీసం పదో తరగతి చదివి ఉండాలి. ఆండ్రాయిడ్ ఫోన్ వాడకంపై అవగాహన ఉండాలి. అలాగే డ్వాక్రా సంఘాలకు సంబంధించిన పుస్తకాల నిర్వహణపై అవగాహన ఉండాలి. ఆసక్తిగల వారి నుంచి కొంతమందిని ఎంపిక చేస్తారు. మరోవైపు 25 కంటే ఎక్కువ డ్వాక్రా సంఘాలు ఉన్న గ్రామాలలో 6 నుంచి 10 మందిని ఈ - నారీలుగా ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన అనంతరం వారికి ట్రైనింగ్ కూడా ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

# ఏపీలో భూముల రీసర్వే .. జనవరి 2 నుంచి ప్రారంభం



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,ఏపీ ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల సర్వే జరిగింది. అయితే ఈ సర్వేలో పొరపాట్లు జరిగాయంటూ ఏపీలోని టీడీపీ కూటమి సర్కారు.. భూముల రీసర్వే చేపడుతోంది. ఈ క్రమంలోనే అనకాపల్లి జిల్లాలో నాలుగో విడత భూముల రీసర్వే చేపట్టనున్నారు. జనవరి 2వ తేదీ నుంచి నాలుగో విడత భూముల రీసర్వే ప్రారంభం కానుంది. గతంలో జరిగిన పొరపాట్లు, తప్పులు మరోసారి పునరావృతం కాకుండా ఈసారి అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పక్కా కొలతలతో భూములను గుర్తించి.. ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా భూముల రీసర్వే చేపట్టనున్నారు. మరోవైపు అనకాపల్లి జిల్లాలో నాలుగో విడత భూముల రీసర్వే 63 గ్రామాల పరిధిలో జరగనుంది.ఎంపిక చేసిన ఈ 63 గ్రామాలలో..182 రోజుల్లోగా నాలుగో విడత భూముల రీసర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. సర్వేపై ఇప్పటికే గ్రామసభల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వైసీపీ హయాంలో చేసిన భూముల సర్వేలో తప్పులు దొర్లాయని.. విస్తీర్ణంలో తప్పులతో పాటుగా జాయింట్ ఎల్పీ నంబర్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం చెప్తోంది. ఈ నేపథ్యంలోనే భూముల రీసర్వే ప్రక్రియ చేపడుతోంది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలోని 733 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా... 488 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. మూడు విడతలుగా సర్వే ప్రక్రియ చేపట్టారు. తాజాగా నాలుగో విడత భూముల రీసర్వే కింద ఎంపిక చేసిన 63 గ్రామాల్లోని 1.28 లక్షల ఎకరాల్లో రీసర్వే జరగనుంది. ఈ 63 గ్రామాలలో.. 37 గ్రామాలు నర్సీపట్నం డివిజన్‌లోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు రీసర్వే పూర్తి అయిన తర్వాత రైతులకు ప్రభుత్వం కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయనుంది. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందించనుంది. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు త్వరలోనే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇటీవల వెల్లడించారు. మరోవైపు పట్టాదారు పాసుపుస్తకాలలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంతో కొన్నిచోట్ల ఆలస్యమవుతోందనే వాదనలు ఉన్నాయి.

## అయోధ్యలో ఏపీ సీఎం చంద్రబాబు సందడి: బాలరాముడి దర్శనం, శిల్పకళా వైభవంపై ప్రశంసలు



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అయోధ్యలోని భవ్య రామమందిరాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సందర్శించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రామ మందిర నిర్మాణం పూర్తికావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఇది భారతీయులందరి చిరకాల స్వప్నమని కొనియాడారు.

ఆలయ ప్రాంగణం మొత్తం కలియతిరిగిన చంద్రబాబు, అక్కడి అద్భుతమైన శిల్పకళను ఆసక్తిగా తిలకించారు. భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా చెక్కిన రాతి శిల్పాలు, స్తంభాలపై ఉన్న కళాకృతులను చూసి ఆయన మంత్రముగ్ధులయ్యారు. ఆధునిక సాంకేతికతను, పురాతన శిల్పకళను జోడించి ఈ మందిరాన్ని నిర్మించిన తీరు అమోఘమని ఆయన ప్రశంసించారు. ప్రతి అడుగులోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ రూపకల్పన జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు.

అనంతరం గర్భాలయంలో వేంచేసి ఉన్న బాల రాముడిని చంద్రబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. బాలరాముడి విగ్రహం అత్యంత తేజోవంతంగా ఉందని, రాముడి సన్నిధిలో గడపడం తనకు ఎనలేని ప్రశాంతతను ఇచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఈ సందర్భంగా ఆయన మొక్కుకున్నారు.

దర్శనం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభూతిని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ ట్వీట్ చేశారు. అద్భుతమైన అయోధ్య ఆలయంలో బాలరాముడిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీరాముడి విలువలు, ఆదర్శాలు మనందరికీ ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తుంటాయని, ఆయన చూపిన ధర్మ మార్గం ప్రపంచానికి ఆదర్శమని కొనియాడారు. ఈ పర్యటన తన జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని చంద్రబాబు వెల్లడించారు.

## గ్రావెల్ మాఫియా



సబ్బవరం, డిసెంబరు 28 సబ్బవరం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు, కొండపోరంబోకు స్థలాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత మంది కూటమి ప్రజాప్రతినిధుల పేరు చెప్పి గ్రావెల్ తవ్వుకుపోతున్నారని చెబుతున్నారు. ఒకవేళ అధికారులు అడపాదడపా దాడులు చేసి, వాహనాలకు నామమాత్రంగా జరిమానాలు విధిస్తుండడంతో గ్రావెల్ అక్రమ తవ్వకందారులకు భయం లేకుండా పోతున్నదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

మండలంలోని వంగలి, బంగారమ్మపాలెం గ్రామాల మధ్య నల్లకొండ ఫారెస్టుకు అనుకొని ఉన్న కొండను గత కొన్ని రోజులుగా అక్రమార్కులు భారీ యంత్రాలతో తవ్వి, డంపర్లతో గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. దొంగలమర్రి సీతారాంపురం(డీఎంఎస్ పురం) భూముల్లో దేవీపురం కొండ వెనుక భాగంలో కూడా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇంకా గాలిభీమవరం, నంగినారపాడు, అసకపల్లి (వజ్రాల కొండ) ఎన్టీఆర్(జగనన్న) కాలనీలకు అనుకొని ఉన్న కొండలను తొలిచేస్తున్నారు. కొన్నిచోట్ల సుమారు 20 అడుగుల లోతు మేర గ్రావెల్ తవ్వుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వున్న కొండవాలు ప్రదేశాల్లో తవ్విన గ్రావెల్‌ను దువ్వాడ, కూర్మన్నపాలెం, గాజువాక పరిసర ప్రాంతాలకు రవాణా చేసి అమ్ముకుంటున్నారు. అక్రమార్కులకు స్థానికంగా వుండే కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైటప్‌ః28ఎంపికె2.. పాటిపల్లిలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న కొండ ప్రాంతం ఇదే

మునగపాక మండలంలో..

మునగపాక, డిసెంబరు 28 మండలంలో పాటిపల్లి గ్రామం పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌కు సమీపంలో కొండలను గ్రావెల్ అక్రమార్కులు ధ్వంసం చేస్తున్నారు. ఇక్కడ నాణ్యమైన గ్రావెల్ వుండడంతో రాత్రిపూట యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. కాకరాపల్లి గ్రామం నుంచి మోడల్ స్కూల్ మీదుగా రాజుపేట రోడ్డు వైపు సాయంత్రం ఐదు గంటల తరువాత జనసంచారం వుండదు. దీంతో గ్రావెల్ అక్రమార్కులకు బాగా కలిసొచ్చింది. ఇంకా తోటాడ, కాకరాపల్లి, చిన్నోడుపాలెం, మల్లవరం, నరేంద్రపురం తదితర గ్రామాల్లో కూడా కొండవాలు ప్రదేశాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## అమ్మో..పోలీస్! తనిఖీల్లో పట్టుబడుతున్న రికార్డులు లేని వాహనాలు

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** – శృంగవరపుకోట పట్టణ పరిధిలో శుక్రవారం పోలీస్‌లు డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. శివరామరాజు పేట రోడ్డు సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న యువకులను గుర్తించారు. అక్కడకు వెళ్లి మద్యం తాగుతున్నవారిని పట్టుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు. ఇదే విధంగా డ్రోన్ కెమెరా సహకారంతో తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు పెంచింది. డ్రోన్ కెమెరాను కూడా విస్తృతంగా వినియోగిస్తోంది. గంజాయి, మత్తు పదార్థాలను సేవించే అసాంఘిక శక్తులు పట్టుబడకపోయినప్పటికీ బహిరంగంగా మద్యం సేవిస్తున్నవారు, తాగి వాహనం నడుపుతున్నవారు, పేకాట ఆడుతున్నవారు, అర్హత లేకుండా వాహనాలను నడుపుతున్న మైనర్లు మాత్రం దొరుకుతున్నారు. దీంతో ఏ రోడ్డులో పోలీస్‌లు వాహన తనిఖీలు చేపడుతున్నారో, డ్రోన్ కెమెరాలెక్కడ ఎగరేస్తున్నారోనన్న భయం వీరికి పట్టుకుంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు అన్ని చర్యలు చేపడుతోంది. ప్రధానంగా మత్తుపదార్థాల తరలింపు, విక్రయాలు, సేవించడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. జిల్లాలో గంజాయి రవాణా అత్యధికంగా సాగుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరాయి. దీంతో కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వ్యాపారుల ఆస్తుల జప్తు, పీడీ యాక్టు ప్రయోగం వంటి చర్యలకు దిగింది. అయితే పోలీస్ తనిఖీల్లో ఎక్కువగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నవారు, అర్హత లేకుండా వాహనాలను తీస్తున్నవారు పట్టుబడుతున్నారు. డ్రోన్ కెమోరాలకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నవారు, పేకాట అడుతున్నవారు కనిపిస్తున్నారు. వీరితోనూ సమాజానికి నష్టం ఏర్పడుతుండడంతో



అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగిస్తున్నారు. న్యాయాధికారులు కూడా జరినామాతో పాటు వారం రోజులు జైలు శిక్ష విధిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో సగానికి పైగా తాగి వాహనం నడుపుతున్నవారితోను, మైనర్‌లు డ్రైవింగ్ చేయడంతో జరుగుతున్నవే. ఇక పేకాటతోనూ కుటుంబాలను నిర్లక్ష్యం చేసేవారున్నారు. ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం చేసేస్తున్నారు. ఆత్మహత్యలు, హత్యలకు ప్రేరేపిస్తున్నారు. ఇవన్నీ శాంతి భద్రతలకు ముప్పుగా పరిణమిస్తున్నందున జిల్లా పోలీస్ శాఖ వాటిని కట్టడి చేసేందుకు ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. మరో మూడు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. డిసెంబర్ 31న కొత్తసంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు యువత వివిధ రకాలుగా ప్రయత్నిస్తుంటుంది. వారంతా పోలీస్ డ్రోన్ నిఘా గురించి తెలిసి కాస్త తగ్గే అవకాశం ఉంది.

## గుర్ల గెడ్డ రిజర్వాయర్ భూముల్లో పాగా



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** దశాబ్దాల కిందట తెరపైకి వచ్చిన గుర్లగెడ్డ మినీరిజర్వాయర్ నేటికీ నిర్మాణం పూర్తికాకపోగా వాటి భూములతో మాత్రం కొందరు వ్యాపారం చేస్తున్నారు. రిజర్వాయర్ భూములుగా మ్యుటేషన్ కాని పరిణామాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఇప్పటికే మూడు చేతులు మారాయని సమాచారం. మూడో వ్యక్తి ఇటీవల రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న భూముల్లో చదును చేయడంతో విషయం బయటకు పొక్కింది. రైతు సంఘాలు కూడా కన్నెర్ర చేస్తున్నాయి.

మెంటాడ మండలంలోని గుర్లగెడ్డ మినీరిజర్వాయర్ భూములు పెద్దమనుషులకు పప్పుబెల్లాలవుతున్నాయి. సుమారు పాతికేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 203 ఎకరాలను సేకరించింది. ఇందులో 138 ఎకరాలు ప్రభుత్వానివి కాగా 65 ఎకరాలు ప్రైవేటు భూమి. రైతుల నుంచి సేకరించిన ఈ భూములను రిజర్వాయర్ భూములుగా మ్యుటేషన్ చేయలేదు. దీంతో అవి రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ రైతులపేర్లు మీదే ఉండడంతో క్రమక్రమంగా పరాధీనమవుతున్నాయి. ఇప్పటికే ముగ్గురు చేతులు మారగా మూడోవ్యక్తి తాను కొనుగోలు చేసిన భూమిలో కొంతమేర ఇటీవల రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాడు. ఆ సంస్థ అక్కడ పనులు కూడా ప్రారంభించింది. రైతుల నుంచి కొనుగోలు చేసినట్టుగా ఆధారాలు ఉన్నాయని చెబుతున్న మూడో వ్యక్తి.. రిజర్వాయర్ స్థలాన్ని ఆనుకొని చదునుచేయడంతో విషయం బయటకు పొక్కింది. ఆ భూమిని కూడా తనభూమిలో కలిపేసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వాయర్ భూములు ఇలా అన్యాక్రాంతమవడంతో కొన్నాళ్ళకు రిజర్వాయర్ ఉనికికే ముప్పు వాటిల్లేలా ఉందన్న వామపక్ష, ప్రజా, రైతుసంఘాలు ఆందోళన బాట పట్టాయి. తక్షణమే విచారణ జరిపి రిజర్వాయర్ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఫ మెంటాడ, ప్రస్తుత అల్లూరి జిల్లా అనంతగిరి మండలాల సరిహద్దుల్లో ఉన్న సుమారు పది గ్రామాలకు చెందిన దాదాపు మూడువేల ఎకరాల భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో 2000 సంవత్సరంలో రూ.4.28కోట్ల అంచనా వ్యయంతో గుర్లగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేయదలిచారు. నిర్మాణం నిమిత్తం సుమారు 203 ఎకరాలను సేకరించారు. ప్రాజెక్టు పనులు 80 శాతం మేర పూర్తయిన సమయంలో అటవీశాఖ అభ్యంతరాలతో నాటినుంచి అసంపూర్తిగా నిలిచిపోయింది.

ఫ రైతుల నుంచి సేకరించిన భూములను ప్రభుత్వం రిజర్వాయర్ భూములుగా మ్యుటేషన్ చేసుకొని గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియ జరగలేదు. అవి రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ రైతుల పేర్లమీదే ఉన్నాయి. దీన్ని పసిగట్టిన కొందరు వ్యాపారులు ఈ భూములపై కన్నేసి రైతులకు నచ్చజెప్పి ఎంతోకొంత ముట్టజెప్పి తమపేర్లమీద రిజిస్ట్రేషన్ చేయించుకోవడం పరిపాటిగా మారింది. చాలా భూమి ఇప్పటికి ముగ్గురు చేతులు మారిపోయింది.సర్రుప్ వీల్ ఆనుకొని చదును రెండోవ్యక్తి నుంచి కొన్నాళ్ళ క్రితం సుమారు 40 ఎకరాల మేర కొనుగోలు చేసిన విజయనగరానికి చెందిన వ్యక్తి, ఐదెకరాలను ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు విక్రయించాడు. సర్రుప్ వీల్‌కు ఆనుకొని ఉన్న భూమిని చదును చేయడంతో విషయం బయటకు పొక్కింది. దీనిపై గుర్ల రిజర్వాయర్ ఇరిగేషన్ జేఈ నవీన్ ఏఎస్ఆర్ జిల్లా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

వామపక్షాల ఆందోళన బాట

రిజర్వాయర్ భూముల కొనుగోలు చేసింది చాలక సర్రుప్ వీల్‌కు ఆనుకొని చదును చేయడంపై స్థానిక వామపక్ష,రైతు,ప్రజా సంఘాలు ఆందోళన బాట పట్టాయి.కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఆక్రమణలు గుర్తించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

రికార్డులు అందుబాటులో లేవు

ప్రాజెక్టు జేఈ నవీన్

గుర్ల మినీ జలాశయం కోసం సేకరించిన భూమి వివరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఏఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలాల పరిధిలో రిజర్వాయర్ కోసం భూములు సేకరించారు. రెండు మండలాల అధికారుల నుంచి సమాచారం అడిగాను. అలానే బొబ్బిలి భూసేకరణ అధికారులను కూడా సంప్రదించాను. మ్యుటేషన్ కాకపోవడంతో ఇంకా రైతుల నుంచి భూ బదలాయింపు జరగలేదు. ఎంతమంది రైతులకు పరిహారం చెల్లించారో ఇప్పుడే చెప్పలేం.

## ప్రమాదాల నివారణ కోసం,,,,ఆటో డ్రైవర్లకు రోజా పూలు





**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 28,** విజయవాడ పోలీసులు విధి నిర్వహణలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మిస్టర్ పర్ఫెక్ట్ ఆటో డ్రైవర్ పేరుతో.. వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో వ్యవహరించే ఆటోడ్రైవర్లను సత్కరిస్తున్నారు. రోజా పూలు అందిస్తూ వారిని గౌరవిస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా డ్రెస్ కోడ్ ఉంటుంది. అలాగే వాహనాన్ని నడిపే సమయంలో అనేక నియమాలు పాటించాల్సి ఉంటుంది. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా.. రవాణా శాఖ అధికారులు డ్రైవర్లకు కొన్ని నియమ నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇలాంటి నియమాలను కచ్చితంగా పాటిస్తున్న ఆటో డ్రైవర్లను విజయవాడ ట్రాఫిక్ పోలీసులు సత్కరిస్తున్నారు. వారికి రోజా పూలు అందిస్తూ, ఫోటోలు దిగుతూ ప్రోత్సహిస్తున్నారు. అలాగే మిస్టర్ పర్ఫెక్ట్ ఆటో డ్రైవర్ అంటూ పూలదండలు వేసి సత్కరిస్తున్నారు.మరోవైపు హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఊరట కల్గించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 238 కేసుల్లో 247 మందికి రూ.2 కోట్లు నష్టపరిహారం అందేలా ఎన్టీఆర్ జిల్లా ఎస్పీ చర్యలు తీసుకున్నారు. మరణించిన 51 కుటుంబాలకు 2 లక్షల చొప్పున.. గాయపడిన 196 మందికి రూ. 50,000 చొప్పున అందించారు. మరోవైపు క్రిస్మస్ సందర్భంగా ఇటీవల మహిళా పోలీసు సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. సాయి తేజ కన్సల్టెన్సి, మెడ్‌ప్లస్, నాట్కో సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు.అలాగే భవానీ దీక్షల సందర్భంగా విజయవాడ పోలీసులు అందించిన సేవలపైనా ప్రశంసలు వ్యక్తమయ్యాయి. భవానీ దీక్షల సమయంలో తప్పిపోయిన బాలికను కేవలం గంటలోనే క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించటంపై భక్తుల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయి. భవాని దీక్షల సందర్భంగా రథం సెంటర్ వద్ద తప్పిపోయిన బాలికను విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించి కంట్రోల్ రూంకు తీసుకెళ్లారు. అనంతరం పబ్లిక్ అడ్రెస్ సిస్టం ద్వారా సమాచారం అందించి.. తల్లిదండ్రుల వద్దకు చేరవేశారు. అలాగే సేఫ్ రైడింగ్ మీద కూడా విజయవాడ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వాహనదారులకు బెలూన్లు అందిస్తూ మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది. ట్రాఫిక్ నియమాలు మన కోసం.. మన ప్రాణాల కోసం అంటూ తెలియజేస్తున్నారు. మొత్తంగా సేఫ్ రైడింగ్ విషయంలోనూ, రూల్స్ ఫాలో అవుతున్న ఆటో డ్రైవర్లను ప్రోత్సహిస్తున్న విషయంలోనూ విజయవాడ పోలీసులపై నెట్టింట ప్రశంసలు కురుస్తున్నాయి.

# సినిమా



## ఈ కర్లీ హీరోయిన్ తమ్ముడు కూడా టాలీవుడ్ లో క్రేజీ హీరో.

తెలంగాణ ప్రాంతానికి చెందిన శాన్వి మేఘన చిరంజీవి నటించిన సైరా నరసింహారెడ్డి సినిమాతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. ఈ సినిమాలో ఆమె ఓ చిన్న పాత్రలో తళుక్కుమంది. ఆ తర్వాత 2019 లోనే బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పిట్ట కథలు, పుష్పక విమానం, ప్రేమ విమానం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, టుక్ టుక్, కుడుంబస్థాన్ తదితర సినిమాలతో తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరువైపోయింది. తన క్యూట్ యాక్టింగ్, ఎక్స్ ప్రెషన్స్ తో యూత్ కు ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో శాన్వీకి ఓ రేంజ్ లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తను షేర్ చేసే ఫొటోలు,వీడియోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది. అన్నట్లు శాన్వీ తమ్ముడు కూడా టాలీవుడ్ లో క్రేజీ హీరో అన్న విషయం చాలా మందికి తెలియదు. ఇటీవలే అతను నటించిన మొదటి సినిమా రిలీజై సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. దీంతో శాన్వీ సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఇంతకీ ఆ హీరో ఎవరంటే వంశీ పూజిత్. ఇటీవల క్రిస్మస్ కానుకగా పతంగ్ అనే సినిమా రిలీజైన సంగతి తెలిసిందే. చిన్న సినిమా ట్యాగ్ తో ప్రేక్షకుల ముందుక వచ్చిన ఈ సినిమా మంచి విజయం సాధించింది. హైదరాబాద్ సంస్కృతి, గాలి పటాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ యూత్ ను బాగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో నటించింది అందరూ కొత్త వాళ్లే.అందులో వంశీ పూజిత్, ప్రణవ్ కౌశిక్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక వంశీ విషయానికి వస్తే.. పూర్తిచేసి సినిమాల్లోకి వచ్చాడు. గతంలో బ్లాక్ కాఫీ అనే ఒక షార్ట్ ఫిలిం లో నటించి అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. తన ప్రతిభకు ప్రతీకగా అవార్డు కూడా అందుకున్నాడు. ఇప్పుడు పతంగ్ సినిమాతో హీరోగానూ సక్సెస్ కొట్టాడు.





## పల్లీలు ఎవరు తినకూడదో తెలుసా..? తింటే సమస్యే

వేరుశెనగ తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. ఈ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వేరుశెనగకు అనేక ప్రతికూలతలు కూడా ఉన్నాయి. వేరుశెనగకు అలెర్జీ ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే అవి గొంతు నొప్పి, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, శ్వాస ఆడకపోవడానికి కారణమవుతాయి. కొంతమందికి పల్లీలు పడవు. వీరికి పల్లీలు తినగానే వాంతులు, పెదాలు ఉబ్బడం, నాలుక మొద్దుబారిపోవడం, గొంతు వాచినట్లుగా అవ్వడం జరుగుతుంది. ఇలాంటి వారు పల్లీలకు దూరంగా ఉండటం మేలు.

ఆస్తమా వంటి శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు పల్లీలు తినకపోవడమే మంచిది. ఇది ఈ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే శ్వాస సమస్యలు ఉంటే జీడిపప్పు, బాదం, గుమ్మడి గింజలు వంటివి తినడం మేలు. పల్లీలు తినగానే కొంతమందికి చర్మంపై ర్యాషెస్ వస్తాయి. ఇలా దద్దుర్లు వస్తే కూడా పల్లీలకు వీలైనంత దూరంగా ఉండటం మేలు.

ఫ్యాటీ లివర్ వంటి కాలేయ సంబంధ సమస్యలు ఉన్నవారు కూడా పల్లీలు తినొద్దు. ఎందుకంటే పల్లీలు లివర్‌లో కొవ్వు పెంచి సమస్యను తీవ్రతరం చేస్తాయి. రక్తం పల్చబడటం కోసం కొంతమంది మెడిసిన్ వాడుతుంటారు. ఇలాంటి వారు పల్లీలు తీసుకోకపోవడమే మంచిది. పల్లీలలో ప్రోటీన్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది కిడ్నీ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే దీర్ఘకాల కిడ్నీ సమస్యలు ఉన్నవారు పల్లీలకు దూరంగా ఉండాలి. పల్లీలు ఎక్కువగా తింటే బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పల్లీలను మితంగా తీసుకోవడం మంచిది.

ఉడికించిన లేదా వేయించిన పల్లీలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ ఉప్పు కలిపిన, డీప్ ఫ్రై చేసిన పల్లీలు అస్సలు తినకూడదు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు 50గ్రాముల పల్లీలు తినడం మంచిది. బరువు తగ్గాలని చూసేవారు రోజుకు 30గ్రాములకు మించి పల్లీలు తీసుకోకపోవడమే మంచిది.



## రోజుకు మూడు గుడ్లు తింటే ఏమౌతుందో తెలుసా..?

ఆదివారం, సోమవారం అని కాదు.. ప్రతిరోజూ గుడ్లు తినమని పోషకాహార నిపుణులు పదే పదే చెబుతూనే ఉంటారు. కానీ, ఇటీవల కాలంలో గుడ్లు క్యాన్సర్‌కు కారణమవుతాయనే భయం విస్తృతంగా ప్రచారమవుతోంది. కానీ, %ఖీూాూ×% ఈ భావనను తోసిపుచ్చింది. అయినప్పటికీ, కొంతమంది ఇప్పటికీ వాటిని తినడానికి భయపడుతున్నారు. దీనికి తోడు కొంతమంది పోషకాహార నిపుణులు గుడ్డు పచ్చసొన తినడం గురించి అపోహలను వ్యాప్తి చేశారు. ఫలితంగా చాలా మంది ప్లేట్స్ నుండి ఈ కంఫర్ట్ ఫుడ్ అదృశ్యమైంది. అయితే, డాక్టర్ శుభం వాట్స్ ఈ అపోహను బహిరంగంగా ప్రస్తావించారు. అతను ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక రీల్‌ను షేర్ చేశాడు. గుడ్లు తినడం వల్ల ఏమౌతుందో కొన్ని వాస్తవాలను వెల్లడించారు.గుడ్డు పచ్చసొనను రాక్షసంగా చూపించడం పోషకాహార నిపుణులు చేసే అతిపెద్ద మోసం అని డాక్టర్ వాట్స్ వివరించారు. మీ కాలేయం మీ శరీరంలోని 80శాతం కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. గుడ్డు పచ్చసొన నుండి మీకు లభించే ఆహార కొలెస్ట్రాల్ రక్త కొలెస్ట్రాల్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 150,000 మందిపై జరిపిన ఒక పెద్ద అధ్యయనంలో ప్రతిరోజూ గుడ్డు తినడం వల్ల గుండెపోటు లేదా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా, లుటీన్, కొల్లాజెన్, గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ముఖ్యమైన విటమిన్లు అధికంగా ఉండే %ఎఖూ% (మంచి కొలెస్ట్రాల్) కూడా మెరుగుపడుతుందని స్పష్టంగా తేలింది. అసలైన సమస్య పచ్చసొన కాదు, వంట చేసే విధానం అంటున్నారు. చాలా మంది వెన్న, క్రీమ్, ఎక్కువ నూనెతో గుడ్లను తయారు చేసి తింటూ ఉంటారు. ఆపై తమకు సమస్య ఉందని చెప్పుకుంటారు. మీరు ఆరోగ్యకరమైన, మధుమేహం లేని, అధిక రక్తపోటు లేని పెద్దలైతే మీరు ప్రతిరోజూ మూడు గుడ్లు సులభంగా తినవచ్చు అంటున్నారు.చాలా సంవత్సరాలుగా గుడ్డు సొనలు గుండెకు హానికరమని భావించేవారు. కానీ, ఆధునిక శాస్త్రం ఈ అపోహను పూర్తిగా తోసిపుచ్చింది. వాస్తవానికి, కాలేయం మన శరీరంలోని కొలెస్ట్రాల్‌లో ఎక్కువ భాగాన్ని ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల గుడ్డు సొనల నుండి వచ్చే ఆహార కొలెస్ట్రాల్ రక్త కొలెస్ట్రాల్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు.

## టీమిండియా మెరుపులు.. నాలుగో టీ20 కూడా మనదే..

ఆదివారం శ్రీలంక ఉమెన్స్‌తో జరిగిన నాలుగో టీ20లో కూడా టీమిండియా ఉమెన్స్ గెలుపు జెండా ఎగురవేసింది. తిరువనంతపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 30 పరుగులతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 221-2 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యాన్ని చేధించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 191-6 పరుగులే చేసింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే జరిగిన మూడు టీ20ల్లో భారత్ గెలవగా.. నాలుగో టీ20 కూడా తన ఖాతాలో వేసుకుంది. దీంతో శ్రీలంకపై 4-0 ఆధిక్యంతో కొనసాగుతోంది.

స్మృతి మంధాన రికార్డ్

ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన 80, షెఫాలీ వర్మ 79 పరుగులతో రాణించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌తో స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో మరో రికార్డు సాధించింది. అంర్జాతీయ క్రికెట్‌లో 10 వేల పరుగులు పూర్తి చేసుకుంది. దీంతో 10 వేల పరుగులు చేసిన రెండో భారత మహిళా బ్యాటర్‌గా నిలిచింది. తొలుత భారత్ బ్యాటింగ్‌కు దిగగా.. స్మృతి మంధాన 48 బంతుల్లో 80, షపాలీ వర్మ 46 బంతుల్లో 79, రిచా హెూష్ 16 బంతుల్లో 40, హర్మన్ ప్రీత్ కౌర్ 10 బంతుల్లో 16 పరుగులు చేశారు. దీంతో భారత్ మొత్తం 20 ఓవర్లకు 221-2 పరుగులు చేసింది.




## గౌతమ్ గంభీర్ అవుట్..లక్ష్మణ్ ఇన్? క్లారిటీ ఇచ్చిన బీసీసీఐ.

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చుట్టూ గత కొద్దిరోజులుగా నడుస్తున్న ఊహాగానాలకు ఎట్టకేలకు తెరపడింది. గంభీర్‌ను టెస్టు కోచ్ పదవి నుంచి తప్పిస్తున్నారని, ఆయన స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించబోతున్నారనే వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పడంతో గంభీర్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

పుకార్లకు చెక్ పెట్టిన బీసీసీఐ

సౌతాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ ఓడిపోవడంతో గంభీర్ కోచింగ్ శైలిపై విమర్శలు మొదలయ్యాయి. ఇదే అదనుగా గంభీర్‌ను కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్ (వన్డే, టీ20)కే పరిమితం చేసి, టెస్టులకు వీవీఎస్ లక్ష్మణ్‌ను కోచ్‌గా నియమించాలని బోర్డు భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా ఈ వార్తలను పూర్తిగా ఖండించారు. “మీడియాలో వస్తున్న వార్తలన్నీ కేవలం ఊహాగానాలే. లక్ష్మణ్‌ను సంప్రదించామన్న దాంట్లో వాస్తవం లేదు. గంభీర్ మూడు ఫార్మాట్లలో కోచ్‌గా కొనసాగుతారు” అని ఆయన స్పష్టం చేశారు.

లక్ష్మణ్ ఆసక్తి చూపలేదా?

నిజానికి బీసీసీఐలోని కొందరు అధికారులు లక్ష్మణ్‌తో అనధికారికంగా మాట్లాడారని సమాచారం. అయితే లక్ష్మణ్ ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ బాధ్యతలను నిర్వహించడానికే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. టీమిండియా కోచ్‌గా బాధ్యతలు చేపడితే నిరంతరం ప్రయాణాలు చేయాల్సి ఉంటుందని, అందుకే ఆయన ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో గంభీర్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆయన పదవికి ఎలాంటి ఢోకా లేదని అర్థమవుతోంది.

గంభీర్ ముందున్న సవాళ్లు

బీసీసీఐ మద్దతు తెలిపినప్పటికీ, గంభీర్ భవిష్యత్తు రాబోయే సిరీస్‌లపైనే ఆధారపడి ఉంటుంది. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు గంభీర్ ఒప్పందం ఉన్నప్పటికీ, మధ్యలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ, డబ్ల్యూటీసీ ఫైనల్ వంటి కీలక టోర్నీల్లో భారత్ ప్రదర్శన కీలకం కానుంది. ఒకవేళ ఇక్కడ కూడా జట్టు విఫలమైతే, బోర్డు తన నిర్ణయాన్ని పునరాలోచించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి అయితే గంభీర్ సేఫ్ జోన్ లోనే ఉన్నాడని చెప్పవచ్చు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com